నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం - 73**



# మా నాన్న సాహిత్యం రైతు జీవన సంక్షోభం

- కె. ఎస్. రమణ

కె.సభా కథల్లో నవలల్లో కనిపించే గ్రామీణ మూలాలు, వ్యవసాయ సంక్షోభం, నిరుపేద కుటుంబాల బతుకు వెతలు... ఇవన్నీ ఊహాజనితాలు కావు. అవి ఆయన అనుభవంలోంచి పుట్టినవి. ఆయన చిత్రించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాలూ సంఘర్షణలు, సంవేదనలు, మానవ సంబంధాలలోని విషాదాలూ, బతుకు రగడలు ఆయన పుట్టి పెరిగిన మట్టికి సంబంధించినవే! ఆ జ్ఞాపకాలు వారి కుమారుడు కె.ఎస్.రమణ ఈ వారం మనతో పంచుకుంటున్నారు.




ఆంధ్రప్రదేశ్ చిత్తూరుజిల్లా కొట్రకోన గ్రామంలో అతి నిరుపేద కుటుంబంలో 1923 జులై 1న పార్వతమ్మ చెంగల్రాయప్ప దంపతులకు పుట్టిన మొదటి సంతానం నాన్న. నాన్నకు ఒక తమ్ముడు జయరాం, చెల్లెళ్ళు శకుంతలా, అమరావతమ్మ ఉన్నారు. నాన్న కుటుంబం కొట్రకోన నుంచి కొండరాజుకాల్వకు వలస వచ్చారు.ఉన్న కొద్దిపాటి పొలాలూ పోవడంతో వీధిబడి అయ్యవాడుగా, భజనగుడి పూజారిగా మా తాతగారు కొండ్రాజుకాల్వ గ్రామంలో స్థిరపడ్డారు. మా అవ్వ పార్వతమ్మ పాలూ నెయ్యీ అమ్మి కుటుంబానికి తోడ్పడేది. నాన్నకి చిన్నప్పటినుంచీ చదువంటే చాలా ఇష్టం. కానీ అందుకు పరిస్థితులు సహకరించక కొంతకాలం పశువుల కాపరిగానూ ఉన్నారు. పాఠ్యపుస్తకాలు కొనలేక, పరీక్ష ఫీజులు కట్టలేక పశువుల పేడను ఎరువుగా సేకరించి అమ్మిన డబ్బుతో చదువు సాగించారు. రోజూ కాలినడకన పదిమైళ్ళు నడచివెళ్ళి చదువుకున్నారు. పట్టుదలతో ఎనిమిదవ తరగతి వరకు చదివి టీచర్ ట్రయినింగ్ పూర్తి చేశారు. పదహారేళ్ళ వయస్సులోనే ఉపాధ్యాయుడయ్యారు. ప్రైవేటుగా బి.ఎ. పరీక్షలకు కూచున్నారు. పదేళ్ళ ఉపాధ్యాయ జీవితం తర్వాత పత్రికారంగంలోకి అడుగుపెట్టారు. రాయలసీమ సాహిత్యంలో తొలిసేద్యగాడుగా పలు రకాల పంటలను పండించారు. తన రచనల ద్వారా తరవాతి తరం రచయితలను ప్రభావితం చేశారు.

## జగమంత కుటుంబం

కుటుంబ బాధ్యతలూ బరువులూ నాన్నను నిత్యం వెంటాడుతుండేవి. కుటుంబం అంటే తనదొక్కటే అనుకునే తత్వం కాదాయనది. తమ్ముళ్ళు చెల్లెళ్ళూ స్నేహితులూ మొదలుకుని తాను అది వరకు యెరగని వ్యక్తులకూ కుటుంబాలకూ అసాధారణ రీతిలో అయాచితంగా సహాయ సహకారాలను ఆయన అందించడం చూశాను. మా అమ్మ శ్రీమతి వళ్ళీ దేవి. ఆయన కార్యకలాపాలకు ఆమె సంపూర్ణ సహాయ సహకారాలనందించేది. మా అక్కయ్య నిర్మల చిత్తూరులోనే స్థిరపడింది. అక్కయ్య పెళ్ళి మాత్రమే అమ్మా నాన్నల చేతుల మీదుగా జరిగింది. అక్కయ్య భర్త మధురాంతకం కుమారస్వామి ఇటీవలే ప్రిన్సిపాల్‌గా రిటైరయ్యారు. చైతన్య, శరత్, శైలజ వారి పిల్లలు. నా కిప్పటికీ గుర్తే. 1980 నవంబరు 4 న నాన్న ఆకస్మిక మరణం. ఎస్.వి.యూనివర్శిటీలో ఎంఏ తెలుగు తరగతి గదిలో పాఠాలు వింటున్న నన్ను అప్పటి ప్రిన్సిపాల్ జి.ఎన్.రెడ్డిగారు పిలిపించి ఆ వార్తను చెప్పలేక చెప్పారు. నాన్నని కోల్పోయిన ఆ క్షణం స్మృతి ఇప్పటికీ నన్ను కలచివేస్తుంది. నాన్న బాగా అడుకున్నది మొదటి మనుమడు చైతన్యతోనే. అతనిప్పుడు జూరిచ్ విశ్వవిద్యాలయంలో సైంటిస్టుగా ఉన్నాడు. నా పెళ్ళి నిశ్చయించి అమ్మ కనుమూశారు. అలా నా పెళ్ళి అమ్మా నాన్నలు లేకుండానే జరిగింది. నా శ్రీమతిపేరు మంజుల. మా బాబు ప్రణవ్ మైసూరులో బీ.ఫార్మసీ చదువుతున్నాడు. నేను చలం మ్యూజింగ్స్‌పై పరిశోధన చేసి డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. నాన్నలాగా వైవిధ్యమైన విస్తృతమైన రచనావ్యాసంగం చేయకపోయినా కవిగా, కథకుడిగా కొంత కృషి చేస్తూ వున్నాను.

## రమణాప్రెస్

చాలా చిన్నప్పటి సంగతి. అప్పుడు చిత్తూరులోని చింతతోపు దగ్గరగా ఊరికి చివరగా పొలాలకు సమీపంగా ఒక ఇంట్లో ఉండేవాళ్ళం. ఎందుకో



పి.రాజగోపాల్ నాయుడుతో కె. సభా



కె.ఎస్.రమణ,కె.ఎస్.నిర్మల – చిరంజీవులతో సభా దంపతులు

కోపం వచ్చి అందరూ మధ్య గదిలో మాట్లాడుకుంటుంటే వసారాలోని లాంతరు తీసుకుని అలా చింతతోపులోకి నడుచుకుంటూ వెళ్ళిపోయాను. కొంతసేపటికి కేకలు, పిలుపులు నాకు దగ్గరయ్యాయి. నాన్న నన్ను ఒక్క ఉదుటున ఎత్తి భుజాన వేసుకుని ఇంట్లోకి తీసుకువచ్చారు. మంచంమీద కూచోబెట్టి అక్కడున్న దిండుతో నా వీపుమీద కొట్టారు. అదే నా జ్ఞాపకంలో నాన్న నన్ను కొట్టడం మొదటిసారీ, చివరిసారీ కూడా. ఎక్కడైనా నెప్పి కలిగిందేమోనని ఆ రాత్రంతా ఆయన బాధపడుతూనే ఉన్నారట. పిల్లల్ని హాయిగా స్వేచ్ఛగా ఎదగనివ్వడం, వారి ఎంపికకు, అభిరుచికి, వ్యక్తీకరణకు ప్రాధాన్యాన్నివ్వటం చాలా అవసరం అని ఆయన విశ్వాసం. చలంగారి ''బిడ్డల శిక్షణ'' ప్రయోగం ప్రభావం మా పెంపకంమీద చాలా ఉంది. నా వేసవి సెలవులూ, వారాంతాలూ తిరువణ్ణామలైలో చలంగారింట్లో గడిచేవి. బంధువుల ఇళ్ళకి మమ్మల్ని చాలా తక్కువగా తీసుకెళ్ళేవారు. తిరువణ్ణామలైలో గుడిలో ఒక కొలనులో చాలా చేపలుండేవి. ఒకసారి చిన్నప్పుడు వాటికి మరమరాలను వేస్తూ జారి నీళ్ళలోకి వెళ్ళిపోయాను. నాన్న దూకి నన్ను పైకి తీసుకొచ్చారు. ఆయన గజ ఈతగాడు. కృష్ణానది బ్యారేజీ అటూ ఇటూ ఈదిన సాహసి.

మాకు 'రమణా ప్రెస్' ఉండేది. దేవదత్తం పత్రిక ఉండేది. ప్రెస్సులో నేను కంపోజింగ్ నేర్చుకున్నాను. ఓటర్ల లిస్టులు ప్రచురించే పనుల్లో నేనూ చాలా పని చేసే వాణ్ణి. నా పనికి సరిపడా డబ్బులు నాన్న నాకు చెల్లించేవారు. కష్టపడితేనే నాలుగు కాసులు కళ్ళచూడడం విలువవుతుందనే స్పృహ చిన్నతనంలో ఆయన నాలో కలిగించారు. రమణాప్రెస్‌లో సాయంత్రం అయ్యేసరికి సాహిత్య వాతావరణం గుబాళించేది. ముంగర శంకర్రాజు, మునిసుందరం, కలువకొలను సదానంద, కాణిపాకం లింగన్న, ఎంఆర్.చంద్ర, సి.వేణు, లగడపాటి భాస్కర్, మునిశ్రీ, మధురాంతకం రాజారాం, పులికంటి కృష్ణారెడ్డి మొదలైన వారితోబాటు అప్పుడప్పుడూ శంకరంబాడి సుందరాచారి వచ్చేవారు. రచయితలూ, పాత్రికేయుల సందడితో రమణాప్రెస్ కళకళలాడుతూ ఉండేది. నాన్న స్థాపించిన శారదాపీఠం సాహిత్య విద్యా కార్యక్రమాలకు కేంద్రంగా ఉండేది. దేవదత్తం పత్రికలో చలంగారు మొదలుకొని కొత్త వాళ్ళ రచనలు చాలా వస్తుండేవి. చిత్తూరుజిల్లా రచయితల సంఘం, చిత్తూరుజిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం నిర్వహణ ద్వారా ఎంతోమంది రచయితలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు.

## నాన్న సిగరెట్ అలవాటు

ఇంటా బయటా వెల్లివిరిసిన సాహిత్య వాతావరణం నన్నూరకే ఉండనివ్వదుకదా. విద్యార్థి దశనుండే నేను కవితలు రాస్తుండేవాణ్ణి.ఒక కవి సమ్మేళనంలో నాన్నగారి అధ్యక్షతన నేను పాల్గొన్నాను. ఆ రోజు సన్మానం ఆయన చేతులమీదుగా అందుకున్నాను. ఆ రోజు అమ్మ ఎంత సంతోషించిందో. సంతోషం అనిపించినా నాన్న పైకి నన్ను పొగడ్తగా ఒక్క మాట కూడా అనేవారు కాదు. నా చేత వివేకానందా నుంచి శ్రీశ్రీ వరకు అన్ని రకాల సాహిత్యాన్నీ, రచనల్ని నాన్న చదివించారు. సర్వతోముఖమైన వ్యక్తిత్వ వికాసానికి అన్నీ అవసరమే అనేవారు ఆయన. నాన్న మంచి నటుడు కూడా. తానే రాసిన నాటకాలను కూడా చాలా ప్రదర్శించేవారు. నాటకాల బృందంలో ఊళ్ళో తిరిగిన సందర్భాలూ ఉన్నాయి.తాను నటించిన నాటకంలో ఒకపాత్ర సిగిరెట్టు కాల్చే పాత్ర కావడంతో అప్పటినుంచీ ఆయనకి పొగతాగటం అల

## నచ్చినవి

| | |
|---|---|
| రచయితలు | : డికెన్స్, టాగోర్, శరత్, చలం, కరుణ కుమార, గోఖలే, శ్రీశ్రీ. |
| పుస్తకం | : టాగోర్ గీతాంజలి |
| సినిమా | : మల్లీశ్వరి |
| గాయకులు | : ఘంటసాల, భానుమతి |
| ఆహారం | : సంగటి (రాగి), చింత చిగురు పప్పు |
| నటులు | : చిత్తూరు నాగయ్య, ఎస్.వి.రంగారావు, భానుమతి, సావిత్రి. |
| దైవం | : అరుణాచలేశ్వరుడు |
| సాధన | : రమణ మహర్షి తత్వసారం. |

వాటయ్యిందట. ఆ అలవాటును ఇక పత్రికారంగంలోకి అడుగుపెట్టే సరికి మానుకోలేకపోయానని అంటుండేవారు.

### నాన్నకి డికెన్స్ అంటే చాలా ఇష్టం

నాకు ఆంగ్ల సాహిత్యం చదవడం, ఆంగ్ల చిత్రాలు చూడటం అలవాటు చేసింది నాన్నే. మదరాసులో ఆంధ్రప్రభలో ఉన్నప్పుడు నాన్న సినిమా రివ్యూలు చాలా రాసేవారు. ఆయనకి డికెన్స్ అంటే చాలా అభిమానం. బాల ప్రభను దశాబ్దంపైగా నిర్వహించారు. ఆ సందర్భంలో పిల్లలకోసం చాలా ఫెయిరీటెయిల్స్‌ను అనువాదం చేశారు. టాగూర్, శరత్‌లంటే ఆయనకి చాలా ప్రేమ. గీతాంజలి ఆయనకి నచ్చిన పుస్తకం. గురజాడ, శ్రీపాద, చలం, శ్రీశ్రీ లంటే యిష్టం. కరుణకుమార, మాగోఖలే అంటే అభిమానం. ఆంధ్రప్రభలో వున్నప్పుడే జానపదగీతాల్ని చాలా సేకరించి ప్రచురించారు. ఘంటసాల లలితగీతాలు, భక్తి గీతాలు భానుమతిగానం చాలా యిష్టపడేవారు. రంగస్థల నటుడిగా చిత్తూరు నాగయ్యను అభిమానించేవారు. ఎస్.వి.రంగారావు నట నను మెచ్చుకునేవారు. చిత్తూరుజిల్లా కళాపరిషత్తు స్థాపన, సాంస్కృతిక వికా సానికి సంబంధించిన పలు కార్యక్రమాల నిర్వహణ ఆయనకు కళలపట్ల అభి రుచికి తార్కాణాలు.

### సంగటి అంటే నాన్నకెంతిష్టమో!!

పల్లెల్లో జరిగే దోపిడీలూ, రాజకీయాలూ, అణచివేతలూ నాన్న కథావస్తు వులు కావటంవల్ల ఆయనమీద ద్వేషం పెంచుకున్న భూస్వాములూ, పెత్తం దార్లూ ఉండేవాళ్ళు. వాళ్ళనుంచి ఆయన ఎన్నో ఆపదల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే రైతాంగ ఉద్యమాల్లో మమేకం అయిన చురుకైన కార్యక ర్తగా, ఎన్.జి.రంగా, గౌతులచ్చన్న, పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, రాజగోపాల్ నాయుడు లాంటి రాజకీయ యోధులకు సహచరుడు కావడంవల్ల నాన్న జోలికి రావడానికి వారు జంకేవారు. నాన్నకి కోపమెక్కువే. అయితే కొద్దిసేప ట్లోనే అన్నీ మరచిపోయేవారు. ఆయనకు ఉదయాన్నే తెల్లటి జుబ్బా, తెల్లటి పంచె, కండువా సిద్ధంగా ఉంచితే చాలు. చద్దన్నం తిని వెళ్ళిపోయేవారు. ఆయన దినచర్యలో రాతపని తప్పనిసరి. డైరీ క్రమం తప్పకుండా రాసుకునే వారు. నడుమునెప్పి అనిపించినప్పుడు అర్ధరాత్రి వరకు బోర్లా పడుకుని మోచేతి ఆసరామీద రాసుకుంటూ ఉండేవారు. అప్పట్లో జిరాక్సు లేదు. కార్బన్ పేపర్ పెట్టి రెండు కాపీలు రాయడం తప్పనిసరి. ఆయన దస్తూరీ చక్కగా ఉండేది. అక్షరాలు ముత్యాల్లా ఉండేవి. కొట్టి వేతలు లేకుండా సాఫీగా వేగంగా రాసేవారు. రచనలు, సమీక్షలు, వార్తలు,వ్యాసాలు, రోజూ ఆయన రాయాల్సిన జాబితా చాలానే ఉండేది. సమయం చాలేదికాదు. కానీ రచన విష యంలో మాత్రం చాలా ఓపిక కనబరచేవారు. ఆయనకు బాగా ఇష్టమైంది సంగటి. రోజులో అది లేకపోతే చాలా కోపం వచ్చేది. మరేగొప్ప రుచులు అడ గడం నేనెప్పుడూ చూళ్ళేదు. ఆయనది రైతు మనస్తత్వం. కొంత పొలాన్ని సంపాదించి అందులో తానే వేరుశెనగలూ, కందులూ వేసి పంట సమయంలో దగ్గరుండి ఆయన అనుభవించిన ఆనందం అంతాఇంతా కాదు. అదీమట్టితో ఆయనకున్న అనుబంధం.

### రావి మొక్క

నాన్న మీద చలంగారి ప్రభావం చాలాఉంది. చలంగారివల్ల నాస్తికుడిగా ఉన్న నాన్న ఆస్తికుడయ్యారు. రమణ మహర్షి భక్తులయ్యారు. అయితే చలం ప్రభావం నాన్న రచనలపై లేదు. సాహిత్యంలో నాన్నది గోర్కీ, మున్షీ, ప్రేమ్ చందల బాటే. నిరుపేదల , బడుగువర్గాల అణగారిన వారి ఆవేదనల్ని , సంఘర్షణ్ని, అంతరంగ ఆర్తిని ఆవిష్కరించే రచయితల బాటలోనే ఆయన నడి చారు. తెలుగు పల్లెపట్టుల్లో ముఖ్యంగా వ్యవసాయ కుటుంబాల, రైతుల జీవన సంక్షోభ దృశ్యాల్ని ఆర్తితో చిత్రించారు.

"ఒక చెణుకుపైరుతోనే రైతు ఆహారసమస్య తీరనట్లే ఒకే కథలో లేక గేయాలో రాస్తే సాహిత్య సమారాధన సంపూర్తికాదు"---అనేవారు నాన్న, అందుకే వారి సాహిత్య వ్యవసాయం ఎంతో వైవిధ్యంతో, విస్తృతితో కనిపిస్తుంది. 1940 ప్రాంతాల్లో తన రచనా జీవితాన్ని ప్రారంభించిన నాన్న దాదాపు 300 కథానికలు రాశారు. వాటిలో కొన్ని బంగారు, పాతాళగంగ, నీటి దీపాలు అనే కథాసంకల నాలు వెలువడ్డాయి. భిక్షుకి, మొగిలి, దేవాంతకుడు మొదలైన నవలలు రాశారు. ఉపాధ్యాయులుగా పిల్లలతో ఆయన సాన్నిహిత్యం వారికోసం విస్తృతంగా సాహిత్యం సృష్టించడానికి ప్రేరణ అయ్యింది. మత్స్య కన్యలు, సూర్యం, చంద్రం, కవీగాయకుడూ, పసి హృదయాలు, బుజ్జీజిజా, పావురాలు మొదలైన పిల్లల నవ లలూ, వందలాది కథలూ రాశారు. అది అరగొంతు కథలు, సీసా చరిత్ర, ఐక్య మత్యం, చిలకమ్మ బొంగరం, అన్నయ్య చిన్నయ్య, ఎత్తుకు పైఎత్తు మొదలైనవి



కె.సభా, శ్రీమతి శ్రీవల్లీదేవి

సంపుటాలుగా వచ్చాయి. బాలగేయాలు కొన్ని వందలు రాశారు. పరీక్షా ఫలి తాలు, చిట్టి మరదలు, ఏటిగట్టున, చావుబేరం మొదలైన సంకలనాలుగా పిల్లల నాటికలు వెలువడ్డాయి. రైతురాజ్యం, పాంచజన్యం వంటి బుర్రకథలు చైనా యుద్ధ కాలంలో ప్రభుత్వమే ప్రచురించి ప్రదర్శింపజేసింది. పద్య రచనలో కూడా నాన్న అందెవేసిన చేయి. పండితుల సమక్షంలో అష్టావధానం నిర్వహించి శెభాష్ అనిపించుకున్నారు. దయానిధి, వేదభూమి ఆయన పద్యకావ్యాలు. విశ్వ రూప సందర్శనం ఆయన గేయకావ్యం. పత్రికా రచయితగా ప్రజారాజ్యం, జమీ న్‌రైతు, నాగేలు, వాహిని, ఆంధ్రప్రభలో పనిచేస్తూ, సంపాదకుడుగా దేవదత్తం వారపత్రికలోనూ సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక అంశాల మీద కొన్ని వందల వ్యాసాలను ప్రచురించారు. ఇలా నాన్న ప్రతి ప్రక్రియలోను రచనలు చేయడం అప్పుడప్పుడే సాహిత్య రంగంలోకి వస్తున్న వర్ధమాన రచయి తలకు స్ఫూర్తి అయ్యింది. రాయలసీమ ప్రజల జీవన మూలాలను చిత్రించే క్రమంలోరాయలసీమ నుడికారానికి, పలుకుబళ్ళకు, మాండలికానికి నాన్న సాహిత్య గౌరవాన్ని కలిగించారు. సుప్రసిద్ధ రచయిత మధురాంతకం రాజారాం మాటల్లో చెప్పాలంటే "రెండు బండల మధ్య గల నెరియలో నుంచి అంకురించి తన ఉనికి కోసం మనుగడకోసం ప్రకృతితో పోరాడే రావిమొక్కలా ఎదిగి శాఖో పశాఖల మహావృక్షంగా విస్తరిల్లిన రచయిత కె.సభాగారు."

**- రామకృష్ణ**

నాకు నచ్చిన మా నాన్న కథ

# మిథునలగ్నం

- కె. సభా



"ఏమిట్రా ఆలోచిస్తున్నావు? మీ అమ్మ చెప్పిందిలే.... ముందు ఆ కట్ట క్రింద తోట ఆడేసిగానీ పోవడానికి వీలుకాదు. ఆ పని చూడు. ఉగాది ఇంకా యిరవై రోజులుండగానే అత్తగారింటికి పయనం ఎందుకూ?" అని సాగదీశాడు మాధవయ్య.

నాన్నగారి ముందు అట్టే నిలబడి మాట్లాడే అలవాటే లేదు బసవయ్యకు. మారు మాట్లాడకుండా కట్ట క్రిందకి వెళ్ళిపోయాడు. తోట చుట్టూ తిరిగి చూచాడు. నాన్న చెప్పింది నిజమేననిపించింది. చుట్టూ ఉన్న తోటలు గూడా ఐపో వచ్చినై. అదను తప్పితే చెరకు ఎండిపోతుంది. ఇప్పుడైతే గెడకు కడివెడు పాలు గారకపోయినా మోపుకో కడవైనా వస్తుంది. ఉగాదికి అత్తగారింటికి వెళ్ళి మళ్ళీ వచ్చేలోగా తోట పరిగిలి పోతుంది.

వెంటనే పొయ్యి కట్టించాలనుకొన్నాడు. అక్కడికక్కడి గానుగాడితే శ్రమ కూడా తగ్గుతుంది. నిరుడు గానిగింటిదాకా చెరకులను చేరవేయడానికే ఎద్దులకు సరిపోయింది. అంచేత ఆ రాత్రే పని ప్రారంభించాడు. పొద్దు పుట్టేటప్పటికి గానుగకు కావలసిన సరంజామా అంతా సేకరించాడు. పెనిమ, గోర, దోనె, సిబ్బె అన్నీ చేర్చాడు కానీ గానుగలో చంద్రవంక విరిగిపోయింది. పేటలో సుబ్బరామయ్య వద్దకు మనిషిని పంపి అదీ తెప్పించాడు.

చెరకులు కొట్టడానికీ, చెలగడానికీ కూలీలు వచ్చారు. చెరకులు పెట్టడానికి ఓ కుర్రాడు చాలు. తోలడానికింకో కుర్రాడు. పెనిమ ముందు మాత్రం మంచి మనిషి కావాలి. సేద్యగాడు పైపనులు చూచుకొంటాడు. గానుగ తిరగడం ప్రారంభించింది.

బసవయ్యకు సుభద్రమీద మనసు పోయింది. అతని ఆలోచనకు కారణం లేకపోలేదు. సుభద్ర యింటికివచ్చాక గానుగెత్తి ఉంటే ఎంతో బావుండేది. ఆమె గానుగలో చెరకులు పెడుతుంటే తాను ఎద్దులను తోలేవాడు. తాను చెరకులను కొట్టి పడేస్తుంటే ఆమె మోపులు కడుతుండేది. తాను బండిలో నిలబడినప్పుడు ఆమె మోపులందిస్తుండేది. అంతేనా ఉడుకుడుకు వరి నూకల సంగటి – చింత చిగురూ లేత వంకాయలూ పచ్చిమిరపకాయల పుల్లగూరతో ఆమె మధ్యాహ్నం అన్నం తెస్తే పందిరి క్రింద కూచుని ఆప్యాయంగా తినేవాడు గదా! ముదురు పాగులో వెలగపండును ఉడికించి ఇచ్చేవాడు. లేత పాగులో శనగలూ, కొబ్బరి ముక్కలు, పేరిన నెయ్యీ కలిపి పంచుకొనేవారు.

వెన్నెల రాత్రుల్లో తడియారని చెరకు పిప్పి పరుపుల మీద లేత బెల్లం పాగు సువాసనల మలయమారుతాలలో కట్ట క్రింద మనోహరమైన ప్రకృతిలో సుభద్రా తానూ ఒకరిలో ఒకరు లీనమై పోయేవారు.

నాలుగైదు లేత మిరపకాయలూ, ఒకటి రెండు నిమ్మపండ్లూ చెరకు గడల చీలికలలో పెట్టి వాటిని గానుగలోకి వదిలితే ఆ వచ్చే చెరకు పానకంలో కాశీ పిచనాల సన్నబియ్యం ఉడికించి ఆ పొంగలిని ప్రతి సాయంకాలం తినేవారు. ఇట్లా ఆలోచనలు ఎన్నో ఉండగా నాన్నగారు ముందు తోటను ఆడించి ఆ వెనుక అత్తగారింటికి వెళ్ళి సుభద్రను తీసుకురమ్మన్నారు. అవును నాన్నగారు చెప్పింది అక్షరాలా నిజం. పిప్పిదేలిన చెరకు ఎందుకు పనికి వస్తుంది? పుచ్చిపోతే పుర్రు బెల్లం కూడా కాదు. అసలు సవరం బంగారు బెల్లం యిప్పుడైతేనే అవుతుంది.

"కట్టక్రింద చెరకుతోట మాత్రం ఉంది. దాన్ని పూర్తిచేసిన వెనుక మీ అల్లుడు వస్తాడు. పండక్కి నాలుగురోజులు ముందుగానే పంపుతాను" అని జాబు వ్రాయించాడు మాధవయ్య. ఆ జాబును సుభద్ర చదువు కొన్నది. ఆమె ముఖంలో అంతకు ముందున్న ఉత్సాహం తగ్గిపోయింది. ఈ మనిషి ఎంత పనిచేసాడు. ఎల్లమ్మ తిరణాలకంత యిక్కడుంటానని చెప్పిపోయాడు. పండుగ పది రోజులుందనగానే ఎల్లమ్మ

తిరణాలు వస్తుంది. తిరణాలు చూచుకొని ఆ రాత్రికి సినిమాకు కూడా వెళ్ళొద్దామని వూరించాడు. అక్కడ ఫొటోలు కూడా తీసుకుందామన్నాడు. ఈ కట్ట క్రింద మడికి యిప్పుడేమొచ్చింది? ఉగాది పోయాకనే కట్ట క్రింద గానుగెత్తుతామని పది మార్లు చెప్పి వెళ్ళిన పెద్దమనిషి యిప్పుడిట్లా కూచుంటే ఏం చెయ్యాలి!

ఆమె చాలా చాలా అనుకొన్నది. ఎల్లమ్మ తిరుణాలకు అన్నివైపుల నుంచి జనం వస్తారు. ఊళ్ళో ప్రతి యింటికీ చుట్టాలు వస్తారు. ఇంటి ఆడ పడుచులు తమ తమ మొగుళ్ళను వెంటేసుకొని ఊరేగుతుంటే వారి మధ్య నేనెట్లా వెళ్ళగలను అని నొచ్చుకొన్నది కానీ తిరుగు జాబువ్రాసే ధైర్యం లేదు. వ్రాస్తే ఎవరికి వ్రాయాలి? ఏమని వ్రాయాలి! పోనీ అమ్మకైనా చెప్పి నాన్నగారి చేత వ్రాయిద్దామంటే వదినెకు తెలిస్తే ఒకటే వేళాకోళం ఆరంభిస్తుంది.

ఇంకా పదేనురోజులు ఇట్లా పడిగాడ్పులు కాస్తే దొరగారు అప్పుడు దిగుతారేమో బండిలో వచ్చి. ఈ ఎండకా గానుగ ఆడకంలో బాగా మసి బారిపోతాడు. ముందే కారు నలుపు. ఆ పళ్ళు తెల్లగా ఉన్నాయి గానీ.

ప్రియుని గురించి అనుకోవడంలో ఆమెకు సిగ్గు ఆవరించింది ఉన్నట్టుండి. వచ్చే నవ్వును మునిపళ్ళతో ఆపుకొంటుండగానే వదినె వచ్చి జాబందుకొని ''ఏం రాశాడమ్మా నీ అర్జునుడు'' అన్నది. ''కాకేమే, నోరు లేని దనేనా'' అంటూ లోపలికి వచ్చింది చంద్రమ్మ.

''నేనేమన్నానూ. జాబు వచ్చింది గదా ఏమని వ్రాశాడని అడిగానంతే'' అన్నది కృష్ణమ్మ.

''చెరకు గానుగయ్యేవరకూ రారంట'' అంటూ అక్కడి నుంచి వెళ్ళి పోయింది సుభద్ర. ఆమాట విన్నదే అత్తా కోడళ్ళకు దిగాలుమన్నది. ఈ రోజో రేపో వస్తాడని రోజుకో పిండి వంట, పూటకో ఫలహారం తయారు చేయడానికి అన్నీ అమర్చుకొంటున్నారిద్దరూ. అల్లుడు రావడం వాయిదా పడగానే వారిలో నిరుత్సాహం ఆవరించింది.

''సరే.... సేద్యం చేసేవాడికి సెలవెక్కడుంది'' అంటూ ప్రవేశించాడు చెంగయ్య.

చెంగయ్యను చూడగానే కోడలు పెరటివైపు వెళ్ళిపోయింది. చంద్రమ్మ మాత్రం చెంగయ్య కాళ్ళవైపు కూచుని కూతురికి పంపవలసిన మర్యాదలను గురించి ప్రస్తావించింది.

చెంగయ్య అంతకుముందే నిశ్చయించుకొన్నాడు. మగబిడ్డతో పాటు ఆడ బిడ్డలకు కూడా ఆస్తి మీద హక్కులున్నాయని తెలిశాక ఆయన ముందు వెనుకలు చూడకుండా ఉగాది సాంగ్యానికి బాగా పెట్టి పంపించాలను కొన్నాడు. ఆ మాటకు వస్తే చంద్రమ్మే కొంచెం వెనకడుగు వేస్తుంది. కోడలు కృష్ణమ్మ గాని, కొడుకు సుబ్బయ్య గానీ సుభద్రకు ఎంత పెట్టినా అడ్డు చెప్పరు. పెళ్ళినాడే సుభద్రకు పదహారు సవరాల కాసుల పేరూ, ఒక బంగారు వడ్డాణం తీసిపెట్టారు. ఉగాది సాంగ్యమప్పుడు కొనవలసినవెన్నో ఉన్నాయి. పిండికొద్దీ నిప్పట అన్నట్లు డబ్బు కొద్దీ ఉంటుంది ఖర్చు.

''తిరుపతిలో కంటే కాళహస్తిలో పాత్రలు చౌకగా దొరుకుతాయంటారు. నిలువండాలు రెండు, కడియాలండాలు రెండు, హంస బొమ్మల దీపస్తంభాలు, ఇంకా కావలసినవన్నీ అక్కడ కొనుక్కోవచ్చు'' అన్నాడు చెంగయ్య. ఆ సమయంలోనే పెరటివైపు నుంచి కిటికీ ప్రక్క నిలబడి కృష్ణమ్మ గునుస్తూ అన్నది.

''ఆ కొనేవేమో శిలవరం పాత్రలే కొనండి. ఇప్పుడందరూ అవే కొంటున్నారు. ఎప్పుడూ వెండిలాగా తళతళ లాడుతుంటాయి''.





## ఆణిముత్యం

భారతదేశ వ్యవసాయ సంస్కృతి మూలాలను చిత్రించిన రచయితల వరుసలో సభాగారి పేరుండి తీరుతుంది. తెలుగు నేల పల్లె పట్టుల్లో భౌగోళిక బౌద్ధిక సాంస్కృతిక వాతావరణాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేసిన అరుదైన కథకుల్లో ఆయన ఒకరు. రాయలసీమ ప్రాంతీయ ప్రాతినిధ్య రచయితగా కె.సభాగారిని, ప్రాతినిధ్య రచనగా ఆయన రాసిన ''పాతాళగంగ'' కథను విమర్శకులు పేర్కొంటారు. జాతీయత, దేశీయత, వాస్తవికత ఉట్టిపడే కథలెన్నో ఆయన రాశారు. గ్రామీణ జీవన విధ్వంసాన్ని, వ్యవసాయ సంక్షోభంలో చితికిపోయిన రైతు కుటుంబాల వెతల్ని, మానవ సంబంధాలలో వైరుధ్య విషాదాల్ని చిత్రించిన సభాగారు గ్రామీణ జీవన మాధుర్యాన్ని కూడా చిత్రించారు. దాంపత్య ప్రణయాన్నీ ఆవిష్కరించారు. అలాంటి కథల్లో ఆణిముత్యం'మిథున లగ్నం' కథ. నాకు నచ్చిన నాన్న కథ.

**–కె.ఎస్.రమణ**

**9849600547**

''ఆ దానికేం, అసలు వెండి బిందెలూ, వెండి దీపాలు కూడా కొనవచ్చు గానీ'' అన్నది చంద్రమ్మ.

''కానీ-లేదు, అర్ధణా లేదు. ఈ ఉగాదికి నాలుగు వేలు ఖర్చు పెట్టేస్తాను. వెండి సామానులు కూడా ఎక్కువే కొంటాను. మదరాసు నుంచి అద్దాల బీరువా, స్ప్రింగు మంచం, మెత్తలూ, దిండ్లూ, కొనుక్కురమ్మని మిట్టా నారాయణయ్యకు చెప్పేశాను'' అన్నాడు చెంగయ్య.

''కొనండి కొనండి... అప్పు లేకుంటే ఎంతైనా సరే. అప్పు చేశారంటే కొంప మునుగుతుంది'' అంటూ హెచ్చరించింది చంద్రమ్మ.

మల్లెతీగల మాటున పొంచి పొంచి వింటున్న సుభద్ర నాన్న ఎంత మంచి వాడు! అనుకొన్నది. అద్దాల బీరువా, స్ప్రింగు మంచం... వెండి సామాన్లు.

ఓహో! ఇంకా ఎన్నో కావాలి! అంతా ఒక లిస్టు వ్రాస్తే బాగుండునను కొన్నది.

***

అత్తగారింటికి వెళ్ళాలనే ఆతురతతో రోజుకు పన్నెండు నుంచి పద్నాలుగు పదేను పెనిమలు వరకు దించేయడం ప్రారంభించాడు బసవయ్య. పండుగ నాలుగు రోజులుందనగానే పని ముగిసిపోయింది. పని వారికందరికీ యివ్వవలసిన మామూళ్ళు ఇచ్చి పంపేశాడు.

గాజులపల్లె పరసలో కొన్న కొత్తకోడెలు బండికి కట్టాడు. చెల్లెమ్మనూ బావను బండిలో ఎక్కించుకొని అత్తగారింటికి పయనమయ్యాడు కొత్త అల్లుడు బసవయ్య. కొత్తకోడెల కుప్పెల్లో గజ్జలు ఘల్లు ఘల్లు మంటున్నాయి. దారి పొడుగునా పూతా పిందెల మామిడి తోటల్లో కోకిలలు తియ్యగా పాడుతున్నాయి. బసవన్నకు దారి కనిపించడం లేదు. అతని కనులకు సుభద్ర సమ్మోహనాకృతి మాత్రమే కన్పిస్తోంది.

వాయువేగ మనోవేగాలతో నడచిపోతున్నది బండి. ముక్కొండ అంచులు దాటి మల్లెలకోనలో సెలఏటి గట్టున ఆగింది బండి. అంతవరకూ బండిలో కూచున్న చెల్లెమ్మను కూడా పలకరించలేదు బసవయ్య. బావ రుద్రయ్య మాత్రం ఒకటి రెండుమార్లు పలకరిస్తే పరధ్యానంగా సమాధానమిచ్చాడు.

''మీ అన్నకు మతి ఎక్కడో ఉందే. లేకుంటే ఆమడదూరం వరకూ మూగ లాగ ఉండిపోతాడా'' అన్నాడు రుద్రయ్య చెల్లెమ్మ భుజాన్ని తడుతూ.

అప్పుడు జ్ఞప్తికి వచ్చినట్టు ''ఏమన్నావు బావా! ఈసారి అనూ'' అంటూ ములుగర్రతో పొడవబోయాడు బసవయ్య.

''దిగరా ఎల్లయ్యా! ఇంకో గంటసేపేలే'' అంటూ పక పక నవ్వాడు రుద్రయ్య.

ఏటిగట్టున లే ఎండలో మిలమిలలాడే లేత మోదుగాకులు కోసుకొచ్చాడు బసవయ్య. ముగ్గురూ కూచుని చద్దన్నం తిన్నారు. కోడెలకు నీళ్ళు త్రాపి బండిగట్టాడు బసవయ్య

పొద్దు నడిమింటికి వచ్చింది. మిడిమిడి ఎండలో ఘణ ఘణ మంటూ బండిఆగిన చప్పుడైంది చెంగయ్య యింటి ముందు. సుభద్ర రివ్వు మంటూ బయటికి వచ్చి బండి నుంచి దిగుతున్న వారిని చూచి తుర్రు మంటూ లోపలికి పారిపోయింది.

''ఏమిటే... ఏమిటే... ఎందుకలా పరుగెత్తుతున్నావు'' అన్నది కృష్ణమ్మ.

''వచ్చారు. వాళ్ళు వచ్చారు'' అని చక్కా వెళ్ళి పెద్దింటిలో సజ్జల గాదె ప్రక్కన నక్కి కూచున్నది సుభద్ర.

''ఓసీ నీ యిల్లు బంగారం గాను! అంత సిగ్గేమిటే...'' అంటూ చంద్రమ్మ ఆదరా బాదరా బయటికి వచ్చేలోగా ముగ్గురూ బండి దిగి వసారాలో నిలబడ్డారు. చక్కెర పానకం దాహానికి తెచ్చిపెట్టింది. బసవయ్య వసారాలో ఉన్న బెంచీ మీద దిండుకానుకొని కూచున్నాడు. ముఖం చూపకనే పోయింది. మళ్ళీ ఎప్పుడు కన్పిస్తుందో అతనికి తెలియదు.

చెల్లెమ్మ లోపలికి వెళ్ళిపోయింది. రుద్రయ్య స్నానం చేయడానికి పెరట్లోకి వెళ్ళిపోయాడు. బెంచీకి నేరుగా ఉన్న కిటికీ నుంచి లోపలికి చూచాడు. ఊహూ!.... చూపు అనేటంత దూరంలో తన ప్రేయసి ఉన్న జాడే కన్పించదు. ఇంతలో గాజుల గలగల విన్నాడి వంట గది వేపు చూసాడు. కృష్ణమ్మ... నాలుక్కరుచుకొని మెల్లగా పైకి లేచి పెద్దింటి వేపు వెళ్లాడు. అక్కడ చెల్లెమ్మా సుభద్రా గుసగుసలాడుకొంటున్నారు. తన్ను చూచిందే సుభద్ర మళ్ళీ గబగబా వంట గదిలోకి వెళ్ళిపోయింది. చెల్లెమ్మ అన్నవైపు తిన్నగా చూచి ''బలే వదినె'' అంటూ ఆమె కూడా వంట గదిలోకి వెళ్ళిపోయింది.

''ఊ.... కానీ... ఎన్నాళ్ళు తప్పించుకొని తిరుగుతుందిట్లా'' అనుకొని తన్ను తానే సముదాయించుకొని మళ్ళీ వసారాలోకి వెళ్ళి బెంచిమీద పడుకొన్నాడు బసవయ్య. ఐదు నిమిషాలు గడిచాక స్నానం చేయడానికి రమ్మని అత్తగారు చెప్పడంతో పెరటివైపు వెళ్ళాడు. పెరటిలో మల్లెపందిరి కొత్తగా వేసినట్లుంది. ఎండకు చాటుగా స్నానాల గదికి వెదురుచాపలు వేసారు. బసవయ్య స్నానాల గదిలో ప్రవేశించాడు. అత్తగారు నీళ్ళు తోడి పెట్టి వెళ్ళిపోయారు. బసవయ్య స్నానం చేసాడు. కానీ ఉతికిన బట్టలు అందిచ్చేవారు లేరు. అక్కడినుండే కేకవేస్తే బావుండదుగా! ఉన్ని తువ్వాలును కట్టుకొని వసారాలో దూరి లోపలికి పోవడానికి కొంచెం సిగ్గుగానే ఉంది. ఇక్కడి తడిట్లా సతమతమౌతుంటే లోపల వదినే మరదళ్ళకు పేచీ వచ్చింది. చెల్లెమ్మ పెట్టెలో నుంచి బట్టలు తీసి బయటపెట్టి సుభద్రను కేకేసింది. ఇదిగో వదినే మా అన్నయ్య పంచె బట్టుకెళ్లు'' అనగానే ఆ పిల్ల సిగ్గుతో కుంచించుకొంటూ తలుపు చాటుకు వెళ్ళిపోయింది.

''నువ్వే తీసికెళ్ళి యిస్తేనేం'' అన్నాడు రుద్రయ్య.

''చెల్లెకు సిఫార్సు వస్తున్నారల్లే ఉంది. అది నా పనిగాదండీ. అంత అక్కరగా ఉంటే మీరే పట్టుకెళ్ళి యిచ్చిరండి'' అంటూ త్రిప్పికొట్టింది చెల్లెమ్మ. ఈలోగా వంటగదిలో నుంచి కృష్ణమ్మ వచ్చింది.

''చూడక్కా! పంచె పట్టుకెళ్ళి అన్నకిచ్చి రమ్మంటే తలుపుచాటును దాక్కున్నది'' అంటూ ఆ వైపు చూపెట్టింది చెల్లెమ్మ.

''నీకెందుకమ్మా! అక్కడ పడేసి నువ్వు లేచిరా! అంతా ఆటగా ఉంది'' అని చెల్లెమ్మను వంట గదిలోకి తీసుకపోయింది కృష్ణమ్మ. సమయానికి చంద్రమ్మ అరటాకుల కోసం మనిషిని పంపడానికి వెళ్ళిపోయింది స్నానాల గదిలో నున్న బసవయ్య చాలాసేపు ఆలోచించి చివరికి ''చెల్లెమ్మా! చెల్లెమ్మా!'' అంటూ సన్నగా పిలిచాడు. చెల్లెమ్మ బదులివ్వాలనుకొనే లోగానే ''ఆమె నోటికడ్డంగా చెయ్యిపెట్టి నువ్వూరుకో కాసేపు'' అన్నది కృష్ణమ్మ.

సుభద్ర మాత్రం ఉన్నచోట నుంచి కదల్లేదు. చివరికి బసవయ్య తువ్వాలు చుట్టుకొని గబగబా వసారా దాటుకొని ఇంటిలోకి వెళ్ళాడు. అక్కడ నట్టింట పెట్టె మీద నున్న పంచె నెత్తుకొని తలుపు కాస్తా వారా చేద్దామని అక్కడికి వచ్చాడో లేదో సుభద్ర కన్పించింది.

''అమ్మ దొంగా!'' అంటూ ఆమెను పట్టుకోబోయాడు.

***

కంచికి వెళ్ళిన చెంగయ్య ఆ మరునాడే వచ్చేసాడు. మూడు వందలు పెట్టి సుభద్రకో పట్టుచీరె తెచ్చాడు. అల్లునికి పట్టుపంచలూ, చెల్లెమ్మకో పట్టు చీరె, రుద్రయ్యకో జత పట్టు పంచెలూ తెచ్చాడు. మొత్తం తొమ్మిది వందలైందని చంద్రమ్మకు చెప్పాడే కానీ మూడు వందల చీరె నాలుగు వందలైనా ఉంటుందని ఆమె అంచనా. కూతురంటే చెంగయ్యకు తగని ప్రేమ. ''ఇంకో పది సవరలైనా పెట్టు కానీ బట్టలకెందుకు అన్ని డబ్బులు తగలబెట్టడమని చంద్రమ్మ చెప్పినా అతడు వినిపించుకోలేదు. ఒక్క జానెడు వెడల్పున సరిగెపోసిన ఏనుగు అంబారీల అంచు.. ఒక్కగజం వెడల్పుతో పమిటె కొంగు నిండుకూ బంగారు పువ్వులు... సుభద్ర చీరెను చూచి మురిసిపోయింది. ఊరిలో నున్న ప్రతి యిల్లాలూ పనిగట్టుకొని వచ్చి ఆ చీరెను చూచి వెళ్ళారు.

చంద్రమ్మ సంబరం చెప్పతరం కాదు. కృష్ణమ్మకు ఊపిరి సలపలేనంత పని.

ఐదు పెద్ద అండాల నిండుకూ కజ్జాలు కాల్పించారు. మరో మూడు కడియాల అండాల నిండుకూ మనువుపూలు కాల్పించారు. ఈ ఫలహారాలూ, పండ్లూ ఒక్క బండికే సరిపోతే, పాత్రలో బండికి పేర్చి మరో బండిలో అద్దాల బీరువా, ఇంకో బండిలో పందిరి మంచం ఇట్లా నాలుగు బండ్లు సామాన్లతో నింపి, మూడు బండ్లలో మనుషులు వెడితే మర్యాదగా, హుందాగా ఉంటుందని చెంగయ్య ఆలో చన. ఏడు బండ్లతో కూతురూ అల్లుడూ వెళ్ళి దిగినప్పుడు ఆ ఊళ్ళో ముక్కుమీద వేలేసు కొంటారని, కూతురికి మంచి మర్యాద ఉంటుందని అతడు అనుకొన్నాడు. చంద్రమ్మ కూడా అంగీకరించక తప్పలేదు. ఒకవంక జరుగవలసిన ఏర్పాట్లను చూస్తూ వాళ్ళు సతమతమౌతుంటే పది నిమిషాలైనా సుభద్రతో మాట్లాడే అవ కాశం దొరకలేదనే ఆతురతతో బసవయ్య ఆలోచిస్తున్నాడు. తాను యింట్లోకి వెడితే వసారాల్లోకి వచ్చేస్తోంది. వసారాలోకి వస్తే వంట గదిలోకి పోతుంది. సాహసించి వంట గదిలోకి అడుగు పెడితే పెరటిలోకి తుర్రుమంటుంది. పెర టిలో కూడా వెంటాడితే ఎవరైనా చూస్తే నవ్వరూ!

ఈ కొత్త పెళ్ళి కూతుళ్ళకు యింత సిగ్గు ఉంటుందని బసవయ్యకేం తెలుసు? బొట్టు మెళ్లో పడగానే "చల్ మోహనరంగా! ఏటిగట్టునా యిల్లు గడుదాం పదరా" అంటారని అనుకొన్నాడు. తస్సాదియ్యా! పెళ్ళయి రెండు మాసాలు కావ చ్చినా వూ ఆ అనదు. అందుకు తగినట్టుగానే ఉందీ యింటి వ్యవహారం కూడా. కర్మచాలక ఈ బావ ఒకడు దాపురించాడు. ఈ మహానుభావుడేమో తోకంట నారా యణా అంటూ ఎప్పుడూ నాతోనే ఉండాలంటాడు. అదైనా కొంచెం సాయపడు తుందేమో అనుకొంటే అన్నారే అంటూ వెక్కిరిస్తూ వదినె కొంగే పట్టుకొని తిర గడం నేర్చుకొన్నది. ఓరి భగవాన్! ఇదేమిటి విచిత్రం! ఆకునిండా పంచభక్ష్య పర మాన్నాలు వడ్డించి రెండు పెదిమలనూ చేర్చి కుట్టినట్టుందీ వ్యవహారం అనుకొ న్నాడు.

ఆలోచించుకొంటుండగానే సుభద్ర ఆ ప్రక్కనే దూసుకుపోతున్నది. చప్పున ఏదోజ్ఞాపకం వచ్చినట్లు "నీళ్ళు కావాలి" అన్నాడు. బసవయ్య నీళ్ళు నమలుతూ. సుభద్ర తిరిగి చూచి ఒక్క చిరునవ్వు విసిరి వంట గదిలోకి వెళ్ళిపోయింది. నీళ్ళ కోసం ఆ వైపే చూస్తున్నాడు బసవయ్య. నిమిషం గడిచింది. రెండు, మూడు, నాలుగు, పది నిమిషాలు గడిచింది. పావు గంటైనా సుభద్ర బయటికి రాలేదు. "మంచి పెళ్ళాంరా బాబూ! మంచినీళ్ళు కూడా యివ్వదేం?" అనుకొన్నాడు బస వయ్య. కొంచెం కోపం వచ్చింది. మళ్ళీ నవ్వు కూడా వచ్చింది. ఇంతలో వంటగ దిలో నుంచి కృష్ణమ్మ వచ్చి ఫలహారం తట్టను అక్కడ పెట్టింది.

బాగుంది వ్యవహారం అనుకొన్నాడు బసవయ్య. నీళ్ళివ్వదు. కాఫీ ఇవ్వదు. అన్నం పెట్టదు. పలకదు. ఇంత నిర్లక్ష్యమైతే ఎట్లా? ఈ రెండు రోజులూ గడిచాక బసవయ్యంటే ఎంతటివాడో సుభద్రకు తెలిసేలా చేయాలి. ఏడు చెరువులు నీళ్ళు త్రాగించాలి. బాగా ఉడికించాలి – అనుకొన్నాడు. ఆ ఫలహారాలు రుచిస్తేగా! బలే చేదుగా ఉన్నాయి. కాఫీ కూడా అంతే. ఇట్లా గుండెల గుబగుబలతో భగభగమండే ప్రణయానిలాలతో రెండు రోజులు గడిచిపోయాయి.

ఉగాది పండుగనాడు పెళ్ళికొడుకు పీట మీద కూర్చున్నాడు. తలంటు గిన్నెలో బంగారు సవర్లు వేసి నిండుకూ మంచి నూనె పోశారు. పెళ్ళి కూతురు వచ్చి తలం టాలి. ఎందరెన్ని చెప్పినా సుభద్ర ఒప్పుకోదే. "ఆ సిగ్గును అలా ఉంచి ముందు వెళ్ళి తలంటు. ఏమిటే మించి పోతున్నావు? ఈ రోజు వచ్చిన వాడుకే రేపూ వస్తుంది. నడూ..." అంటూ చంద్రమ్మ కూతురిని ఈడ్చుకొని వచ్చింది.

ఓరి బాబో! నలుగురూ నాలుగు ప్రక్కల పిండి నలుగుల తట్టలెత్తుకొని నిలబ డ్డారు. ఊ.... కానియ్యవే వదినా! అంటూ పకపకామన్నది చెల్లెమ్మ. "తప్పదమ్మా బంగారూ!" ఉడికించింది కృష్ణమ్మ. 'మీరు వూరుకొండే..' అంటూ వారించింది చంద్రమ్మ.

అరెరే! ఎంత కష్టం వచ్చిపడింది! వీళ్ళందరికీ నామీద యింత కసి ఎందుకో! అనుకొని నలుగురినీ ఒక్కసారి చూచి ఆ నూనెనంతా ఎత్తి బసవయ్య నెత్తిమీద పోసి తలంటు ప్రారంభించింది. అంతవరకూ నా దగ్గరకే రానంటుందే అని అఘో రిస్తుండిన బసవయ్య కుక్కిన పేనులాగా కిక్కురుమనకుండా తలవంచాడు!

***

బావ మరుదులూ వదినె ఆడబిడ్డల సరసాలతో ఉగాది పండుగ తియ్యగా గడి చిపోయింది. మూడవ రోజు ఉదయాన ప్రయాణాలు.

చెంగయ్య అనుకొన్నట్టుగానే ఏడు బండ్లు సిద్ధం చేసాడు. అన్నీ కొత్త ఎడ్లే. మూడు బండ్లలో మెత్తగా కసువు పరచి దానిమీద జమకాణాలు వేయించాడు. మిగిలిన నాలుగు బండ్ల నిండుకూ సామాన్లు సరిపోయాయి. వధూవరులు అలం

కవిత

poem



## నాద లోలుడి గాన మురళి

సంగీతం సదా నాకు ఒక అనవరత ఉత్ప్రేరకి
సంగీతం సదా నాకు ఒక నిరంతర ఉత్సేకి
సంగీతం సదా నాకు ఒక అవిచ్ఛన్న ఔత్సాహి!
కాని సంగీతం కూడా వ్యసనమవడం మీకు తెలుసా?
సంగీతోద్భవ మాదకత్వ జనిత నిష్క్రియత
ఎవరి తప్పు? సంగీతానిదా? నాదా??
సంగీతం వినని రోజున నేను గొంగళీ పురుగునే!
నా మీద నాకే అసహ్యమేసే దుర్భర దుస్సహస్థితి
కొంతకాలం సంగీతానికి దూరంగా ఉండాలని
తీసుకొన్న ధృఢ నిర్ణయం
నిటారుగా దిగేందుకు నిరంతరం నా శిరస్సుపై
వేలాడుతూ కసిగా వికటాట్టహాసం చేసిన అసి!
సంగీతం దూరమైతే అస్తిత్వ మేముంది?
నాద లోలుడి గాన మురళి స్థిరనివాసం
నా రెండు చెవుల మధ్యనే!
స్వరాల ఉరవడిలో నా శిరస్సు ఓలలాడని క్షణమేది?
సునాద పరిమళం ఒక అమృత స్రోతస్విని
సంగీతంతో శతృత్వం
నాతో నేనే చేసే వ్యర్థ యుద్ధం
సంగీతం వినా బ్రతుకులో శూన్యతకు నిష్కృతి ఏది?
సంగీతం వినా ఉదయం రాగరంజితమయేది ఎలా?
సంగీతం వినా పక్షుల కువకువల్ని
సరిగమలతో నింపేదెవరు?
సంగీతం వినా ఉదయ ముఖానికి
నాద మాధుర్యాన్ని కూర్చేదెవరు?
సంగీతం వినా పువ్వుల పరిమళాల్ని
లయభరితం చేసేదెవరు?

–శశికాంత్ శాతకర్ణి

సెల్: 98853 89759

కరించుకొని పెద్దలకు వందనాలు చేస్తూ వచ్చారు. ఒక్కొక్కరికీ దండం పెట్టినప్పు డల్లా ఒక్కొక్క తాంబూలం ఇస్తూ వచ్చారు. ఇట్లా వీధి పొడుగునా కన్పించిన వారి కల్లా ఇవ్వడం అక్కడి ఆచారం. ఎవరు కన్పించినా సరే. మాల మాదిగలైనా తాంబూలం ఇవ్వాలి. ఆ కడజాతి వారికి దండం పెట్టకపోయినా తాంబూలాలు అందిచ్చినప్పుడు వారు హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తారు.

ఇట్లా వీధి వెంబడీ వెడుతున్న ఉగాది పెండ్లి జంటను చూసి ముచ్చట పడే అమ్మలక్కలందరూ తలో విషయాన్ని గురించి మాట్లాడుతున్నారు. చాలామంది కన్నులు సుభద్ర కట్టుకొన్న పట్టుచీరెమీద వాలినై. మరి కొందరి చూపులేమో వరు సలు దీరి నిలబడ్డ బండ్లమీదికి పోయినై. ఎంత సామాను! సంసారానికి కావలసిన సరంజామా అంతా ఉంది. ఇంట బుట్టిన ఆడబిడ్డకే విధంగా సంతృప్తిగా పెట్టగల గడం కూడా ఒక మహాదృష్టమే అనుకొన్నారు కొందరు.

బండి కూసులపైకి కన్పిస్తున్న హంసదీపాలు చాలా ముచ్చటగా ఉన్నాయి. ఫలహారాల అండాలపై పసుపు బట్టలను కప్పి ఉంచారు.

చంద్రమ్మ కనుకొలకుల్లో నీరు నిలిచింది. చెంగయ్య తనకు తెలియకనే ఆనంద బాష్పాలను రాల్చుకొంటున్నాడు. ఇక ఆగితే కాలయాపన అవుతుందని బండ్లను కదిలించమన్నాడు సుబ్బయ్య. ఊరి పొలిమేరల వరకూ కిటకిట లాడుతూ వచ్చారు జనం. వారికంతా గూడా సుభద్ర మీద ప్రత్యేకమైన అభిమానముంది. ఆమె నలుగురినీ ఆదరించి ఉన్నది. ఎముకలేని చెయ్యి గల ఇల్లాలవుతుందని

అంటూరామెను. ఆ ఊరి చివరలో ఉన్న ముత్యాలమ్మ దేవాలయం వద్ద చేరారందరూ. పూజారి రంగయ్య వచ్చి కొబ్బరికాయ కొట్టి కర్పూరం వెలిగించాడు. వారికి బండారిచ్చి తీర్థం కూడా యిచ్చారు పూజారి.

ఒక్కసారిగా సుభద్రకు దుఃఖం పొర్లుకొని వచ్చింది. భర్తతో పాటు, వెడుతున్నాననే ఆనందం ఒకవైపున ఉన్నా తల్లిదండ్రులనూ స్వజనాన్నీ వదలబోతున్నాననే చింతమాత్రం ఆమెను వదిలిపెట్టలేదు. ఆమె బావురు మనబోయి సమాళించుకొన్నది. ఆ సమయంలో 'అందరి హృదయాలు ఎడబాటవుతున్నామనే భావంతో స్పందించిపోయినవి.

బండిలో కూర్చోమన్నాడు చెంగయ్య కూతుర్ని. ఆమెకు చేయూత నిచ్చి బండి ఎక్కించాడు. బసవయ్య ప్రక్కన కిక్కురుమనకుండా కొండపల్లి బొమ్మలా కూచున్నది సుభద్ర.

సాగనంపను వచ్చినవారందరూ ఆగిపోగా ఏడు బండ్లూ ఊరు దాటు కొన్నాయి. ఊరు వదలుతున్నకొద్దీ సుభద్రలోనున్న ఆందోళన కూడా తగ్గిపోవచ్చింది.

''ఇంకా సిగ్గెందుకు వదినా. తల కొంచెం పైకెత్తూ'' గడ్డం పట్టి పైకెత్తింది చెల్లెమ్మ. సుభద్ర కొద్దిగా తలను పైకెత్తింది. సన్నని వాగు వెంబడీ బండి పోతున్నది. విరిసిన అడవి మల్లెల సువాసనలు గుప్పు గుప్పు మంటున్నవి. తలలో నుంచి జాలారిపూలు రాలిపోతుంటే వాటిని సవరించుకొన్నది. ప్రక్కన కూచున్న బసవయ్య మరీ దగ్గరగా జరిగి కూచుంటుంటే ఆమె సిగ్గుతో మళ్ళీ తలవంచుకొన్నది.

ముందుపోతున్న బండికి వెనుకబండిలో సుబ్బయ్య, కృష్ణమ్మా కూచున్నారు. ఆ బండిలోనే యింకో ముగ్గురు ముత్తయిదువులు కూచుని లోకాభిరామాయణం మాట్లాడుకొంటున్నారు. వెనుకవచ్చే బండ్లు మాత్రం కొంచెం నెమ్మదిగానే వస్తున్నాయి. వాటిలో సామానులు ఉన్నాయి గనుక అవి రాలిపోకుండా బండ్లు నడపాలి. అందుకే బాగా వెనుకబడిపోయినవి.

''ఇంట్లో మాత్రం మా అన్న కన్పిస్తే పారిపోతుంటివే... ఇప్పుడింత పక్కన కరచుకొని కూచున్నావెందుకూ'' ఉడికించాలనే అన్నది చెల్లెమ్మ. సుభద్ర ఏమీ మాట్లాడనేలేదు. ఆమెకు తోడుగా ఆమె పక్షం వాదించే వారా బండిలో ఎవరూ లేరు. ఉన్నవారంతా ఆ ముగ్గురే.

''పలకవమ్మా బంగారూ'' మెల్లగా గిల్లి పెట్టింది చెల్లెమ్మ. ఉన్నట్టుండి సుభద్ర తలవంచుకొనే ఆ ''నువ్వా మా అన్న ప్రక్కన కూర్చోక ఇంకెక్కడ కూచున్నావు'' అన్నది.

''అమ్మ బాబో! నీకు మాట్లాడ్డం కూడా వచ్చినట్లుందే...'' అన్నది చెల్లెమ్మ.

అట్లా మాట్లాడుకుంటూ వెడుతుండగానే నీళ్ళు తాగాలని చెప్పి కాలువ గట్టున బండి నిలపమన్నది చెల్లెమ్మ. బసవయ్య బండిని ఆపి చెల్లెమ్మ దిగాక తానూ దిగాడు.

''రా వదినా నీకు వద్దూ'' అన్నది చెల్లెమ్మ. ''వూహూ'' అన్నది సుభద్ర. అన్నా చెల్లెలిద్దరూ కాలువలోకి దిగి నీళ్ళు త్రాగుతున్న సమయంలో సుభద్ర పగ్గాలు పుచ్చుకొని బండిని కదిలించింది. పరుగో పరుగో అంటూ లంకించుకొన్నాయి. కోడెలు ఇట్లా అరమైలు దూరం బండిని పరుగెత్తించేలోగా బసవయ్య పరుగెత్తి వచ్చాడు. చెల్లెమ్మ నడవలేక రెండో బండిలో కూచున్నది.

బాగా దగ్గరికి వచ్చాక బండిని ఆపింది సుభద్ర. బసవయ్య బండెక్కుతూ, ''బండి తోలడం కూడా వచ్చునే...'' అంటూ ఆమె చేతి లోని పగ్గాలను అలానే ఉంచి తాను వెనుకగా కూచున్నాడు.

ముందు బండి ముందే పోతున్నది. చెల్లెమ్మ కూడా రెండో బండిలోనే ఉండిపోయింది. ఎంత వేగంగా తోలినా ముందు బండి కన్పించకుండా మరీ ముందుకే దూసుకుపోతున్నది.

కొత్త దంపతులు బండిలో కూచున్న విషయం ఆ కొత్త కోడెలకు కూడా తెలిసిపోయి ఉంటుంది. ఎప్పుడూ ఎడతెగకుండా కన్పించే మనుష్యులూ, వదలి పెట్టకుండా వెన్నంటే చెల్లెళ్ళూ, బావలూ, మరదులూ కంటే ఈ కొత్త కోడెలెంత మంచివి!

చల్లనిగాలిలో, సెలయేటి గలగల పాటలను వింటూ, తోటలను, పేటులను దాటుకొంటూ, కోనలలో పాము మెలికలా సాగే జడుములో ఆ కొత్త దంపతులను తీసుకెడుతున్నావా కోడెలు.

మల్లెల కోనలో సెలయేటి గట్టున నూకాలమ్మ సత్రం వద్ద చద్దిఅన్నం తినాలని బసవయ్యకు తెలుసు. అక్కడ ఆపమన్నాడు బండిని. చుట్టూ ఆకసాన్నంటే మామిడిచెట్లు. ఆ మధ్య ఉన్నదా సత్రం. ఒక మంచి నీళ్ళ దిగుడు బావి. ఆ ప్రక్కనే చలువబండ. ఎంత ప్రశాంతమైన చోటు...

వెనుకబండ్లు రావడానికి గంటన్నరైనా పడుతుంది. అంతవరకూ సుభద్ర, బసవయ్య అక్కడే ఉండాలి. పంచాంగం ప్రకారం ఆ క్షణంలోనే మిథున లగ్నం ఆరంభమైంది.

❇

**కథాకళి**

# మనిషే మనీషి!



'మీకు దండం పెడతా. నన్ను వదలండయ్యా. బయటకు వెళ్లనివ్వండయ్యా. బిడ్డకు పాలివ్వాలి' వేడుకుంటున్నది ఆ మహిళ.

'కుదరదంటే కుదరదు. కోట తలుపులు తెరవడం ఎంతమాత్రం సాధ్యం కాదు. ఇది రాజ శాసనం. తలుపులు తెరవాలంటే మళ్లీ రాజుగారు వచ్చి ఆజ్ఞాపించాల్సిందే' తేల్చి చెప్పారు ద్వార పాలకులు.

అది శివాజీ మహారాజు కోట. ఓ మహిళ రోజూ బయట నుంచి వచ్చి కోటలో పని చేస్తుండేది. సాయంత్రానికి మళ్లీ తన ఇంటికి వెళ్లిపోయేది. అయితే ఆ రోజు పని ఎక్కువగా ఉండడంతో బాగా పొద్దుపోయింది.

రాజ శాసనం ప్రకారం సాయంత్రం కాగానే భటులు కోట గుమ్మం తలుపులు మూసివేశారు. ఇక మళ్లీ ఉదయం దాకా వాటిని తీయనే తీయరు. ఈ మహిళకేమో ఇంట్లో చంటి బిడ్డ. వెళ్లి పాలివ్వక తప్పని పరిస్థితి.

ఎంత బతిమిలాడినా భటులు కనికరించడం లేదు. ఇక వీళ్లతో లాభం లేదని గ్రహించింది ఆ మహిళ. అక్కణ్నుంచి వెళ్లిపోతున్నట్టుగా నటిస్తూ, కాస్త దూరంగా చాటుమాటు పొదల్లోకి వెళ్లి, అక్కణ్నుంచి కాపలా లేని కోట గోడ వద్దకు చేరుకుంది.

ఆమెకు కళ్లలో బిడ్డ మాత్రమే కనిపిస్తున్నాడు. చెవుల్లో అతడి ఆకలి ఏడుపే వినిపిస్తున్నది. ఏం చేసిందో, ఎలా చేసిందో తెలియదు. కానీ ఆమె ఎలాగోలా కోట గోడను ఎక్కి, దూకి బయటకు వెళ్లింది. బిడ్డకు తృప్తిగా పాలిచ్చింది.

మళ్లీ ఉదయాన్నే కోట బయట నుంచి పని కోసం వచ్చిన ఆ మహిళను చూసి భటులు ఆశ్చర్య పోయారు. ఎలా వెళ్లావని గద్దించారు. తీసుకెళ్లి రాజుగారి ముందు హాజరుపరిచారు.

'మహారాజా! ఈమె క్షమించరాని నేరం చేసింది. నిన్న రాత్రి మన కోట గోడను ఎక్కి, బయటకు దూకింది. ఈమెకు కఠిన శిక్ష విధించాలి' విన్నవించారు భటులు.

'ఈ సాధారణ మహిళ అంత ఎత్తైన కోట గోడను ఎక్కడమా? ఎక్కి దిగడమే కాకుండా బతికి మళ్లీ రావడమా? ఎలా సాధ్యం' ఆశ్చర్య పోయాడు శివాజీ.

'ఏమమ్మా.. అంత పెద్ద గోడను ఎలా ఎక్కగలిగావు? ఎలా వెళ్లగలిగావు?' అడిగాడు మహారాజు.

'ఏమో అయ్యా. అవేవీ నాకు తెలియవు. ఇంట్లో చంటి బిడ్డ ఉన్నాడు. నేను పాలివ్వకపోతే తట్టుకోలేడు. అందుకే వెళ్లక తప్పదనిపించింది. వెళ్లాను. ఎలా వెళ్లానో నాకూ తెలియదు' చెప్పింది ఆ మహిళ.

***నీతి:*** లక్ష్యాన్ని చేరాలనే ప్రగాఢమైన కాంక్ష సాధారణ వ్యక్తులతో కూడా అసాధారణమైన పనులను చేయిస్తుంది. అసాధ్యమనుకున్న వాటిని కూడా సుసాధ్యం చేస్తుంది. కేవలం లక్ష్యాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకుని ప్రయత్నం ప్రారంభించినపుడు, ఎంత పెద్ద అడ్డంకులు ఉన్నా, ఎంత కఠినమైన సవాళ్లు ఉన్నా దూదిపింజల్లా తేలిపోతాయి. ఆ సవాళ్లన్నింటినీ ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని, చాతుర్యాన్ని ఆ ప్రగాఢ కాంక్షే మనకు అందిస్తుంది. తరుణోపాయాలను చూపిస్తుంది. మనం చేయాల్సిందల్లా సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాన్ని సాధించడానికి పట్టుదలతో ఉండడం. మనం మహాత్ములుగా భావించే అనేకమంది అలా కృత నిశ్చయులై కార్యక్రమాలు మొదలు పెట్టిన మనలాంటి వారే! కొంచం మనసు పెట్టి ప్రయత్నిస్తే మామూలు మనిషి మనీషి కావచ్చు! అనుకున్నది సాధించడమే కదా జీవిత పరమార్థం!

-తిగుళ్ళ కృష్ణమూర్తి